క్లుప్తంగా

అంతర్వేదికి భక్తుల తాకిడి



అంతర్వేది ఆలయంలో స్వామి దర్శనానికి క్యూలో వెళుతున్న భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రం ఆదివారం ఎటు చూసినా భక్తుల రద్దీతో కిక్కిరిసింది. కార్తిక మాసం ఆదివారం సెలవురోజు కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు తరలి వచ్చారు. వేపచెట్టు వద్ద, ఆలయ ప్రధాన గోపురం వెనుక వైపున భక్తులు దీపాలంకరణ చేశారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప, భవానీ మాలధారణ భక్తులు స్వామివారి సన్నిధికి వచ్చారు. అలాగే సుదూర ప్రాంతాల నుంచి వాహనాల్లో దర్శనానికి తరలివచ్చారు. పర్యాటకులు, భక్తులతో ఆలయ ప్రాంగణం ఇసుక వేస్తే రాలనంతగా కిక్కిరిసింది. నిత్యం నిర్వహిస్తున్న నారసింహ సుదర్శన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో భక్తులకు భోజన వసతిని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదానం సిబ్బంది పర్యవేక్షించారు. క్యూ ద్వారా స్వామివారి దర్శనానికి వెళ్లేందుకు భక్తులకు అసౌకర్యం లేకుండా దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.

డ్వాక్రా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకుని డ్వాక్రా మహిళలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఏపీఎం ఎం.ధనరాజు అన్నారు. మండలంలోని చెముడులంకలో డ్వాక్రా మహిళలకు (ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్) వ్యక్తిగత లోన్ల మంజూరుపై నిర్వహించిన అవగాహన స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఎం.వెంకటరమణ పాల్గొని డ్వాక్రా సభ్యులు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఏపీఎం మాట్లాడుతూ మహిళలు చేపట్టే వివిధ వ్యాపార కార్యకలాపాలకు పీఎంఈజీపీ పీఎంఎఫ్‌ఈ, ముద్ర లోన్, విశ్వకర్మ, స్వయం సిద్ధ, నారీ శక్తి, నారీభేరి, ఎంఎస్ఎంఈ, స్టాండప్ ఇండియా, స్వయం సమృద్ధి తదితర పథకాలు దోహద పడుతున్నాయన్నారు. వీటి ద్వారా చిరు వ్యాపారులు తాము నిర్వహించుకునే వ్యాపారాన్ని బట్టి బ్యాంకుల ద్వారా అర్హులైన వారు రుణాలు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. వీఓఏలు వెంకటలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శృంగేరి పీఠాధిపతి విజయయాత్ర ఏర్పాట్ల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: దక్షిణామ్నాయ శృంగేరి పీఠ జగద్గురువులు విధుశేఖర భారతీ మహాస్వామి పర్యటన నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలించారు. స్వామి మలికిపురం మండలం, గుడిమెళ్లంక విచ్చేస్తున్న సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమం వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. అదే విధంగా సంబంధిత అధికారులతో సమీక్ష చేసి ఏ విధమైన లోటుపాట్లు లేకుండా విజయయాత్ర సాగాలని తెలిపారు. పీఠాధిపతి రాత్రి 10 గంటలకు వచ్చేశారు. ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, మాజీ సర్పంచ్ చెల్లింగి సత్యనారాయణ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



సఖినేటిపల్లిలో బీజేపీ సమావేశంలో మాట్లాడుతున్న నగేష్

సఖినేటిపల్లి: మండలంలో వివిధ గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. ఆదివారం సఖినేటిపల్లిలో పార్టీ సీనియర్ నాయకుడు అల్లూరు సత్యనారాయణరాజు ఇంటి వద్ద పార్టీ సమావేశం జరిగింది. సమావేశంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు అంశాన్ని ఆయన పరిశీలించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ ఎనలేని సహకారం అందజేస్తున్నారన్నారు. మహారాష్ట్రలో ఎన్‌డీఏ ఘన విజయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి కొంతం శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ మెంబర్ ఇందుకూరి సుబ్బరాజు, నంబూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమానికి చెల్లుచీటీ..!

- సూపర్ సిక్స్ అమలు కోసం ప్రజల ఎదురుచూపులు
- జగన్ ప్రభుత్వంలో ప్రతి నెలా సంక్షేమ పండగ
- చిరువ్యాపారాలతో ఆర్థికంగా నిలబడ్డ మహిళలు
- నేటి ప్రభుత్వంలో వారి పరిస్థితి అయోమయం



కొత్తపేటలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న నాటి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి (ఫైల్)

కొత్తపేట: గత ఐదేళ్ల జగన్ ప్రభుత్వ సంక్షేమ జాతరతో ఇంటింటా పండగ చేసుకున్న ప్రజానీకానికి కూటమి ప్రభుత్వంలో ఆ సంక్షేమం జాడ కరువైంది. ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు కావస్తున్నా ఇంతవరకు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ అమలు చేయకపోవడంతో ప్రజలకు చిర్రెత్తుకొస్తోంది. కుళాయిల వద్ద, టీ కొట్లు, కిరాణా దుకాణాల దగ్గర కూటమి ప్రభుత్వ తీరును ప్రజలు ముఖ్యంగా మహిళలు దుమ్మెత్తిపోస్తున్నారు. జగనే ఉంటే ఈ పాటికి నెలకో సంక్షేమం చొప్పున తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేసేవారని, కానీ నేటి ప్రభుత్వం ఏర్పడి అర్థ సంవత్సరానికి దగ్గర పడుతున్నా ఇంతవరకు ఇచ్చిన 6 హామీలే అమలు చేయలేదు.. బడ్జెట్లో సైతం పూర్తి స్థాయిలో నిధులు కేటాయింపులు జరపలేదని మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేవలం పెంచిన పింఛను మాత్రమే ఇస్తున్నారని ఏడాదికి మూడు సిలిండర్ల ఉచిత పథకం కూడా అరకొరగానే జరుగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పెట్టే వారిని దూరం చేసుకున్నామని కొట్టే వారిని అందలమెక్కించారంటూ ప్రజానీకం బాహాటంగాపూ విమర్శించే పరిస్థితి నెలకొంది.

జగన్ హయాంలో రూ.5290.17 కోట్ల సంక్షేమం

గత జగన్ ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రత్యక్ష, పరోక్ష నగదు బదిలీ కింద కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో అర్హులైన లబ్ధిదారులందరికీ 33 పథకాలకు సంబంధించి సుమారు రూ.5,290.17 కోట్లు లబ్ధిదారులు ఖాతాలకు జమ చేసి జగన్ ప్రభుత్వం పేదవర్గాలకు అండగా నిలిచింది. ఇక అభివృద్ధికి సంబంధించి రహదారులు, తాగునీరు, పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి సుమారు రూ.2,000 కోట్లు ఖర్చు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది.

పశ్చాత్తాపపడుతున్న ప్రజానీకం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉందా అని ప్రజలు తమను తాము ప్రశ్నించుకుంటున్నారు. కూటమి నేతల మాయమాటలు, అబద్ధాలు నమ్మి మోసపోయామని ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారు. జగన్ ఉన్నప్పుడు ప్రతినెలా పండగేనని కానీ నేటి ప్రభుత్వం గత సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు నిలుపుదల చేసి, ఇస్తామన్న సూపర్ సిక్స్‌ను తుంగలో తొక్కారని ప్రజలు తిడుతున్నారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపు, అవగాహనతో అమలు చేయగలిగే హామీలనే ఇచ్చారని, తూచా తప్పకుండా అమలు చేశారని, కూటమి నేతలు మాత్రం అమలు చేయలేమని తెలిసి కూడా ప్రజలను మోసం చేయడానికి కంకణం కట్టుకుని గద్దెనెక్కారని విమర్శిస్తున్నారు. కూటమి నేతల మాయమాటలు నమ్మి మోసపోయామంటూ ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు.

అరచేతిలో వైకుంఠం చూపారు..



కూటమి నేతలు అరచేతిలో వైకుంఠం చూపి, అమలు కాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టారు. ఒక్క పింఛను పెంచారు తప్ప జగన్ ప్రభుత్వం కంటే మించి ఇది చేశామని చెప్పుకునే పథకం ఏదీ లేదు. జగన్ ప్రభుత్వంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా ఏ విధమైన లోటుకు తావు లేకుండా ప్రతి నెలా ఏదో ఒక పథకం అమలు చేశారు. ఏడాదిలో కనీసం ఒక్కో కుటుంబానికి 3, 4 పథకాలతో లబ్ధి లభించింది. ఆనందంగా జీవనం సాగించాం.

– కుర్రా లక్ష్మి, డ్వాక్రా మహిళ, కొత్తపేట

అర్హులైతే చాలు లబ్ధి అందేది



జగన్ ప్రభుత్వ హయాంలో పార్టీ రహితంగా అర్హులైతే చాలు పారదర్శకంగా సంక్షేమ లబ్ధి ఇంటి గుమ్మంలోకి వచ్చేది. కానీ నేడు పింఛన్ తప్ప మరో సంక్షేమ పథకం అమలు కావడం లేదు. సూపర్ సిక్స్ అన్నారు. వట్టి గ్యాస్ (ఒక గ్యాస్ సిలిండర్)తో సరిపెట్టారు. 5 ఏళ్లు ఆనందంగా గడిపిన కుటుంబాలు నేడు దీనావస్థలో ఉన్నాయి.

– పి.చంద్రావతి, వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు

పేద వర్గాలు అల్లాడుతున్నారు...



సంక్షేమం లేక పేదవర్గాలు అల్లాడిపోతున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో పొందిన సంక్షేమ పథకాలు నేడు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు ఎటువంటి లబ్ధి చేకూరడంలేదని ప్రజలు ముఖ్యంగా మహిళలు వాపోతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిరిగా నేటి కూటమి పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలు చేయాలి.

– గూడపాటి రమాదేవి, జెడ్పీటీసీ, కొత్తపేట

వైభవంగా లక్ష బిల్వార్చనలు



మొగలికుదురులో లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు



ముక్తేశ్వరంలో సామూహిక లక్షబిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

అంబాజీపేట: గంగలకుర్రు గ్రామంలో వేంచేసియున్న సర్వమంగళా పార్వతీ సమేత చిన్నమల్లేశ్వరస్వామి, ఉమా సమేత ఆనందేశ్వర స్వామి వార్లకు ఆదివారం లక్ష బిల్వార్చన చేశారు. అలాగే మాచవరం పార్వతీ రాజరాజేశ్వరి స్వామి, కందుల మల్లేశ్వర స్వామి, పుల్లేటికుర్రు వ్యాఘ్రేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, లక్షపత్రి పూజలు చేశారు. నందంపూడి, తొండవరం, వాకలగరువు, చిరతపూడి తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

మామిడికుదురు: శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తిక మాసం ఆదివారం శివాలయాల్లో లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. పెదపట్నం గ్రామంలోని ప్రసిద్ధి ఉమా మూలేశ్వరస్వామి, మొగలికుదురులోని పార్వతీ మల్లేశ్వరస్వామి ఆలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన పూజలు వైభవంగా జరిపించారు. దీనిలో భాగంగా విఘ్నేశ్వర పూజ, పంచామృతాలతో అభిషేకాలు, బిల్వార్చన, రుద్ర హోమం, చండీ హోమం, కుంకుమార్చన పూజలను వైభవంగా నిర్వహించారు. పలువురు భక్త దంపతులు ఈ పూజల్లో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముక్తేశ్వరంలో..

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం ముక్తికాంత క్షణముక్తేశ్వరుని ఆలయంలో ఆదివారం సామూహిక లక్షబిల్వార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు, ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిపారు. స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం ఆలయ ప్రాగణంలో వివిధ దేవతాకృతుల్లో దీపార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు.

జల్లు స్నాన సౌకర్యం ఏర్పాటు

అంబాజీపేట: భక్తుల సౌకర్యార్థం పుల్లేటికుర్రులో వేంచేసిన బాలాత్రిపుర సుందరీ సమేత అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జల్లు స్నాన సౌకర్యాన్ని అమలాపురం వశిష్ట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు జరిగింది. కౌశిక జలధారగా నామకరణం చేసిన ఈ జల్లు స్నానాన్ని భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు 316బీ జిల్లా గవర్నర్ లయన్ ఈవీవీ ఈశ్వర్ కుమార్ తెలిపారు. స్థానిక సర్పంచ్ జల్లి బాలరాజుతో కలసి ఈ సౌకర్యాన్ని ప్రారంభించారు. అనంతరం సర్వీస్ యాక్టివిటీస్‌లో భాగంగా ఇంటర్మీడియెట్ చదువుతున్న ఒక పేద విద్యార్థి కాసినప్రణీతకు రూ.15 వేల ఉపకార వేతనాన్ని గవర్నర్ పంపిణీ చేశారు. గవర్నర్ ఈశ్వర్‌కుమార్ మాట్లాడుతూ గత 25 ఏళ్ల నుంచి అమలాపురం లయన్స్ క్లబ్ వశిష్ట అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఎన్నో సేవాకార్యక్రమాలు అందజేశారన్నారు. జల్లుస్నాన ప్రాజెక్టుని రూ.30 వేలతో క్లబ్ చార్టర్ మెంబర్ లయన్ పి.సుబ్బలక్ష్మి జ్ఞాపకార్థంగా ఆమె సోదరి లయన్స్ క్లబ్ వశిష్ట ప్రెసిడెంట్ కె.ఉషాబాల ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వశిష్ట ప్రెసిడెంట్ కె.ఉషాబాల, సెక్రటరీ చిక్కాల అరుణ, బెహరా హనుమంత రావు, వీరా రవి, లక్కింశెట్టి భాస్కరరావు, మాజీ సర్పంచి నూకపెయ్యి చిన్న, తదితరులు పాల్గొన్నారు.



పుల్లేటికుర్రులో మాట్లాడుతున్న ఈశ్వర్‌కుమార్

యువత సన్మార్గంలో నడవాలి

కొత్తపేట: యువత సన్మార్గంలో పయనిస్తూ తమ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని సూచించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పలివెలలో 'మాదక ద్రవ్యాలు వద్దు– ఉజ్వల భవిష్యత్తే ముద్దు' అనే నినాదంతో స్థానిక ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ కాత్యాయని మాట్లాడుతూ యువత చెడు సావాసాలు పట్టి చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా యువత ఉత్తమ ఫలితాలతో విద్యను అభ్యసించి, ఉన్నత లక్ష్యాలు సాధించాలని, తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలని సూచించారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అనధికారిక మద్యం విక్రయాలపై దాడులు చేసి 8 మద్యం బాటిళ్లతో పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లిలో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

వనాల్లో జనాల సందడి..

- కార్తికమాసం నాలుగో ఆదివారం
- ఎక్కడికక్కడ వన సమారాధనలు



లంకలగన్నవరంలో ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

కొత్తపేట: కార్తికమాసం నాలుగో ఆదివారం పురస్కరించుకుని ఎక్కడికక్కడ వనాల్లో జనాల సందడి నెలకొంది. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో తోటలు, పంట పొలాలు, దేవాలయాల ప్రాంగణాలు జనాలతో కళ కళలాడాయి. ఎక్కడ చూసినా వన సమారాధనలతో పిల్లలు, పెద్దలు అనే భేదం లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకూ అందరూ ఆట, పాటలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో కాపు వనసమారాధన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పర్యవేక్షణలో పలువురు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన జరిపారు. ముందుగా ఆ ప్రాంగణంలో ఉసిరి చెట్టు వద్ద ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు, ఆయన కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ నాయకుడు ఆకుల రామకృష్ణ, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, మాజీ సర్పంచ్ చింతం విజయకృష్ణమోహన్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో స్థానిక, స్థానికేతరులు పాల్గొన్నారు. అలాగే వానపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు బండారు సత్తిరాజు (రాజా) ఆధ్వర్యంలో ఆయన సోదరులు కార్తిక వనసమారాధన నిర్వహించారు. వానపల్లి లంక ప్రాంతంలోని రాజాకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో పంట పొలాలు, పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో వన భోజనాలు ఏర్పాటు చేశారు. వానపల్లి పరిసర గ్రామాల నుంచి కుల, మతాలకు అతీతంగా అత్యధిక సంఖ్యలో జనం పాల్గొన్నారు. కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం గ్రామ దేవత తాళ్లమ్మ తల్లి అమ్మవారి ఆలయం వద్ద ఆలయ కమిటీ అధ్యక్షుడు మిద్దు సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, స్థానికులు కార్తిక వన సమారాధన నిర్వహించారు.

ఆలమూరులో..

ఆలమూరు: ఆత్మీయతకు, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే వనసమారాధనలు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం వైభవంగా జరిగాయి. ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధనలు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో కార్తిక సందడి నెలకొంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ ఆటపాటలతో సందడి చేశారు. పినపళ్లలోని గంగాలమ్మ ఆలయం వద్ద, సంధిపూడిలో నాగేంద్ర పుట్ట వద్ద దాతల సహకారంతో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు.

పి.గన్నవరం మండలంలో..

పి.గన్నవరం: లంకలగన్నవరం డొక్కావారి తోటలో ఆదివారం కాపు కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. కాపు సామాజిక వర్గానికి చెందిన పలువురు కుటుంబ సభ్యులతో సహా వచ్చి ఉసిరిచెట్టు వద్ద పూజలు చేశారు. వినోద కార్యక్రమాల్లో భాగంగా మహిళలు మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్ ఆడి అలరించారు. బాలికలు ఆటలు ఆడి, పాటలు పాడి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది.

అంబాజీపేటలో..

అంబాజీపేట: కార్తికమాసం పురస్కరించుకుని మండలంలో వన సమారాధన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం కావడంతో గ్రామాల్లో ఉద్యోగులు, చిరు వ్యాపారులు, విద్యార్థులు కొబ్బరి తోటలో వన సమారాధనలు చేపట్టారు. తొలుత ఉసిరి చెట్టు దామోదర స్వామికి సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వన సమారాధన అనంతరం చిన్నా, పెద్దలు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

పెదపట్నంలంకలో..

మామిడికుదురు: పెదపట్నంలంక గిడుగువారి పాలెంలో గిడుగు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా గిడుగు వెంకటేశ్వరరావు, సత్తిబాబు, బుజ్జి, నాగమహేష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. కార్తిక మాసం సందర్భంగా ఈ వన భోజనాలు ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు ఈ వన భోజనాలకు తరలి వచ్చారు. పవిత్రమైన కార్తిక మాసంలో అందరినీ ఐక్యం చేసేందుకు పూర్వం పెద్దలు కార్తిక వన భోజనాలు ఏర్పాటు చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు.



పెదపట్నంలంకలో పూజలు చేస్తున్న గిడుగు వారి కుటుంబ సభ్యులు



పినపళ్లలోని గంగాలమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తున్న వన సమారాధన

ఆదమరిస్తే.. ప్రమాదమే



ముక్కామలలో మధ్యకు విడిపోయిన సీసీ రోడ్డు

అంబాజీపేట: ముక్కామల పీహెచ్‌సీకి వెళ్లే ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు మధ్యకు విడిపోయి ప్రమాదభరితంగా ఉంది. ఈ రోడ్డులో ప్రయాణికులు, వాహనదారులు, సైక్లిస్టులు ఆదమరిచి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు మధ్యకు విడిపోవడంతో మోటారు సైకిళ్లు, సైక్లిస్టులు బెర్మ్‌ల నుంచి జారి పడి ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క ప్రధాన పంట కాలువ, మరో పక్క పంట కాల్వలు ఉన్నాయి. ఏ మాత్రం ప్రమాదం జరిగిన ఏదో ఒక కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు. అధికారులు స్పందించి మధ్యగా విడిపోయిన సీసీ రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు కొత్తపేటలో మెగా రక్తదాన శిబిరం

కొత్తపేట: జితేంద్ర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ చైర్మన్ అండ్ ఫౌండర్ మట్టపర్తి జితేంద్రకుమార్ తెలిపారు. సహస్ర బ్లడ్ సెంటర్ వారితో స్థానిక ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాలులో ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తమ సేవా ఫౌండేషన్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సహస్ర బ్లడ్ సెంటర్ ద్వారా, నేరుగా రక్తదాతల నుంచి రక్తదానం చేయిస్తున్నట్టు తెలిపారు. దానిలో భాగంగా తాజాగా నిర్వహిస్తున్న శిబిరంలో రక్తదానం చేయడానికి ఇప్పటి వరకూ 106 మంది రక్తదాతలు ముందుకు వచ్చి పేర్లు నమోదు చేసుకున్నారని జితేంద్ర తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే అందుకు ముందుకు రావాలని కోరారు. ఆ మేరకు రక్తదాతలతో పాటు అత్యవసరంగా రక్తం అవసరమైన వారు సెల్:9966772333, 9966772666 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రీకృష్ణతత్వం అర్థం కావాలి



శ్రీకృష్ణుని నామ పారాయణ చేస్తున్న భక్తులు

అయినవిల్లి: ఎక్కడా తగ్గాలి, ఎక్కడ నెగ్గాలి, ఎలా ప్రవర్తించాలి అన్నీ అర్థం కావాలంటే శ్రీకృష్ణతత్వం అర్థం కావాలని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం ప్రభూజీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి విశేష పూజలు చేశారు. అనంతరం శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ భగవద్గీతను బోధించారు. గీతామృతాన్ని, నామాన్ని పారాయణ చేశారు. అధిక సంఖ్యలో స్వామిని దర్శించి స్వామి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ముమ్మరంగా కోతలు



మామిడికుదురులో సార్వా మాసూళ్లు

మామిడికుదురు: సార్వా కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎంతో కష్టపడి సాగు చేసిన పంట పక్వానికి రావడంతో రైతులు కోతలపై దృష్టి సారించారు. మండలంలో 2,420 ఎకరాల విస్తీర్ణంలో రైతులు సార్వా పంట సాగు చేశారు. ప్రస్తుతం వాతావరణం సానుకూలంగా ఉండడంతో జోరుగా కోతలు కోస్తున్నారు. కోత కోసి, పంట నూర్పిడి చేసే పనుల్లో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. కోత మెషీన్లను కూడా రైతులు ఆశ్రయించడంతో పంట నూర్పిడి స్పీడుగా జరుగుతోంది. ఇంత వరకు 150 ఎకరాల విస్తీర్ణంలో కోతలు కోశారని మండల వ్యవసాయాధికారి బి.మృదుల తెలిపారు. సగటున దిగుబడి 25 నుంచి 28 బస్తాలు వస్తుందని ఆమె పేర్కొన్నారు. ఒక వైపు వాతావరణ శాఖ తుపాను హెచ్చరికలు జారీ చేస్తుండగా, మరో వైపు జోరుగా కోతలు కోస్తున్నారు.

అన్నదాత గుండెల్లో గుబులు

అంబాజీపేట: బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిందని దీని ప్రభావం వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించడంతో మళ్లీ దొరికిపోతామా ! అంటూ రైతుల్లో గుబులు మొదలైంది. ఖరీఫ్ సీజన్ ఆది నుంచి అవాంతరాలే కలుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. నారుమళ్ల దశలో కురిసిన భారీవర్షాలకు నారుమళ్లు దెబ్బతిన్నాయి. నాట్లు వేసిన తరువాత సంభవించిన భారీ వర్షాలు, వరదలకు కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గంలో సుమారు 4 వేలకు పైగా ఎకరాల్లో పంట పూర్తిగా పాడైపోయింది. దెబ్బతిన్న చేలల్లో మళ్లీ నాట్లు వేసి సాగు చేశారు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలోని పి.గన్నవరంలో 25,382, కొత్తపేటలో 34,702, రాజోలు నియోజకవర్గంలో 8,650 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో 30 శాతం పంట కోతలు ప్రారంభమయ్యాయి. డిసెంబర్ మొదటి వారం నుంచి కోతలు ముమ్మరంగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం పలుచోట్ల వరి మొక్కలు దిట్టంగా కంకులు వేసి, గింజ గట్టి పడే దశలో ఉంది. చాలా గ్రామాల్లో వరి కోతలు ప్రారంభించారు. ఈ పరిస్థితుల్లో వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే చేతికందొచ్చిన పంట తుపాను పాలవుతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.